# అభిప్రాయాలు

ఎం. ఎస్. మూర్తి

*

'శేషయ్యా ?'
'ప్రభూ? '
'నీది వరహాల బుర్రోయ్—'
'మళ్ళీ యేదో కొత్త పుట్టిములక ? లేకపోతే నాపాడు బుర్రగొడవ—'
'ఈ నల్లకోటు చూడు—ఇప్పుడే తెచ్చాడు దర్జీ.'
'చూశానండి!'
'ఈ తెల్ల పంట్లాం ?'
'అదీ కనివిన్నూనే వుందండి !'
'కనిపించడం కాదోయ్—బాగున్నాయని అనవేం ?'
'విషమ నమన్య తెచ్చి పెట్టారు !'
'నీ నిజాభిప్రాయం చెప్పు—కోప్పడనులే—'
'మీరు కోప్పడరు గదా అని వెధవనై పోవడం నాకిష్టం లేదు !'
'మారాం చెయ్యకు శేషయ్యా—నీకెలా తోస్తే అలా చెప్పు—ఈ తెల్ల పంట్లాంమీదికి ఈ నల్లకోటు బావుందా అని నాప్రశ్న. ఇందులో విషమూలేదు, నమస్యా లేదు. సూటిగా చెప్పు—అయిదు నిముషాలు టైమిచ్చా—'
'............'
'ఏం ? ఈ తెల్లపంట్లాం మీదికి ఈ నల్లకోటు...... ?'
'బంగారు గుడ్లు పెట్టడానికి కోడికి తగినంత సావధానం యివ్వాలండి. ఇలా తొందర చేస్తే...'
'ఇచ్చాం—మరో అయిదు నిముషాలు !'
'............'
'ఏం—ఇంక గుడ్డు పెట్టగలవా ?'
'పొట్ట చీల్చినా...'
'శేషయ్యా, కొరడా...'
'దేవిగా రొస్తున్నారు—ఆమె నడగండి. ఆవిడ అభిప్రాయమే నా అభిప్రాయం—'

*　　*　　*

'దేవి శుద్ధ మూర్ఖురాలు! ఈ తెల్ల పంట్లామీందికి ఈ నల్లకోటుబాగు లేదంటూంది !'
'చిత్తం.'
'నువ్వు అలానే అభిప్రాయపడుతున్నావా ?'
'దేవిగారి అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తున్నారా లేదా అనే దానిమీద ఆధారపడి వుంటుందండి నా నమాధానం !'
'వెర్రివాడా ! నీవంటి మంత్రివుండీకూడా ఆ మూర్ఖురాలి అభిప్రాయంతో ఏకీభవించి మాటైతే నా గొప్పేమిటి ?'
'నిజమేనండి'
'ఏమిటి నిజం ?'
'నేను వెర్రివాడినేనండి !'
'అది అలావుంచు-నే ననేది దేవి అభిప్రాయంతో ఏకీభవిస్తే నా గొప్పేమిటని ?'
'అంతేనండి.'
'ఏమిటంతే ?'
'మీ గొప్పేమిటని ?'
'శేషయ్యా !'
'అది కాదండి, కోప్పడకండి. మీకు గొప్పలేదని ఎవరూ అనటంలేదు—'
'మరేమిటీ ?'
'మరే ముందండి—మీరన్నదే—దేవిగారి అభిప్రాయంతో ఏకీభవిస్తే మీ గొప్పేమిటని—'
'రైట్ ! సరియైన మాట అన్నావు !'
'నే ననలేదండి—మీరే !'
'ఎవరో ఒకరు—నిజమంతేగా ?'
'నా జవాబుకోనం ప్రభువులు ఆగ నక్కర్లేదండి—తమరు చెప్పదలుచుకున్నదేదో-'
'చెప్పమన్నావా ?'
'చెప్పక వూరుకుంటారా ?'
'ఈ తెల్లపంట్లాం మీదికి ఈ నల్లకోటే బావుందని నా అభిప్రాయం-'
'కావచ్చునండి !'
'ఏమిటి కావచ్చు ?'
'మీ అభిప్రాయం మీదే కావచ్చునండి !'
'దేవి అభిప్రాయం ఇది కాదు-'
'కాక పోవచ్చునండి !'
'ఈ తెల్లపంట్లాం మీదికి ఈ నల్లకోటు బాగులేదంటుంది దేవి-'
'అన్నారండి—అంటారండి !'
'దేవి !'
'చిత్తం-'
'మూర్ఖురాలు! '
'వింటున్నానండి !'
'ఈ తెల్లపంట్లాం మీదికి ఈ నల్లకోటు బాగులేదుట !'
'చిత్తం-'
'ఏమిటి చిత్తం ?'
'ఆ తెల్లపంట్లాం మీదికి ఆ నల్లకోటు నా మొహంలా వుందండి.'